# సంతకం

అరుగు మీద కూర్చున్న గంగ చూపులన్నీ వీధి మలుపు పైనే వున్నాయి. కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నది.

ఆ సమయములో పోస్టుమన్ హనుమంతు రావాలి!

గంగ ఎదురు చూడడంలో తప్పేం లేదు. ఆమె భర్త శివయ్య- అలా అంటే అతనికి కోపం వస్తుంది-శివరావు నుంచి నెలరోజుల పైగా ఉత్తరం లేదు.

హైద్రాబాద్‌లో ఉత్తరం రాయడానికి తీరిక దొరకడం కష్టం అనుకుని యిన్నాళ్ళు సరిపెట్టుకుంది. కాని ఎంత బిజీ పన్లు చేసే ఉద్యోగికైనా నెలరోజుల్లో ఒక్క పది నిమిషాలు పెళ్ళాంకు కార్డు ముక్క రాసి పడేసే తీరుబాటు లభించలేదంటే అది తీసేయ దగ్గ విషయం కాదని యిరుగు పొరుగు చెప్పగా అర్థమయింది ఆమెకు.

అందుకే ఒళ్ళంతా కళ్ళు చేసుకుని ఎదురు చూస్తున్నది భర్త నుండి ఓ చిన్న లేఖ వస్తుందని.

కారు చీకటిలో కాంతి రేఖలా- మండుటెండలో వర్షపుజల్లులా దూరంగా నీర్సంగా వస్తున్న హనుమంతు ఆమె కళ్ళల్లో పడ్డాడు.

రోజూ ఆమె ఎదురు చూడ్డం-అతగాడు 'ఏమిరాలేదమ్మా' అని చెప్పి వెళ్ళి పోవడం జరిగేది. 'సరిగా చూడు హనుమంతు ' అర్థింపులాంటి గద్దింపు చేసేది రోజూ ఆమె!

కాని ఈ రోజన్నా...

అతను ఆ గుమ్మం ముందు ఆగడం ఆమెకెంతో ఆనందాన్ని యిచ్చింది.'హమ్మయ్య' యిన్నాళ్ళకు తన పతి దేవుడికి దయ కలిగింది.

"గంగ మీరే కదా!"

"ఉత్తరం మొచ్చిందా?"

"ఆఁ!ఇక్కడ సంతకం పెట్టి తీసుకోండి-వేలిముద్ర!"

"నే ఎలా కనిపిస్తున్నానేంటి? ఇలాతే కాగితం-సంతకం గీకుతా!" నిర్లక్ష్యంగా అతను చూపించిన కాగితం మీద సంతకం చేసింది కూడబలుక్కుని.

హనుమంతు ఎగాదిగా చూస్తూ ఆమెకు ఓ కవరందించాడు. ఓ కార్డులాంటిది కవరు నుండి వేరు చేసి దాని మీద కూడ సంతకం పెట్టించుకున్నాడు.

ఆమె గొంతులో పచ్చి వెలక్కాయ పడింది! ఆ కవరు చింపి చదవమని అడగడానికి అభిమానం అడ్డు వచ్చింది. తనకు చదువురాదని అతగాడికి ఎందుకు తెలియాలి? హనుమంతు ఆమె వంక అదోరకంగా చూస్తూ వెళ్ళిపోయాడు.

గంగ ఇంట్లో కొచ్చిందన్న మాటే గాని చెప్పలేని ఆరాటం! ఏకంగా తన భర్త రిజిష్టర్డు లెటరు రాశాడు. మామూలుగా డబ్బాలో వేస్తే ఈ పోస్టల్ వాళ్ళు అందచేస్తారో లేదోనని, భద్రంగా చేరాలని, పైసలు ఖర్చుపెట్టి రిజిష్టరు చేశాడు.

ఆ కవరు హృదయానికి హత్తుకుంది.

తన భర్త చేతుల్లో ఉన్నట్లే హాయి కలిగింది ఆమెకు.

చించి చదవాలన్న ఆరాటం-చదువురాదన్న న్యూనతా భావం..ఏం రాశాడోనన్న కుతూహలం...సస్పెన్సు ఆమెని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మనసులో వేదన.....

"అయ్యా ! నేను చదువుకుంటానే!" అరిగిపోయిన గ్రామ్ ఫోన్ ప్లేటులా అప్పటికి ఆమె వందోసారి అంది.

"ఛస్! నోర్ముయ్! ఎముకలు ఏరేస్తాను." చలమయ్య తోక తొక్కిన తాచులా లేచాడు.

"ఏం? నే చదువుకోకూడదా?" గంగ అడిగింది.

"ఎన్ని సార్లు చెప్పాలి- నిన్ను బళ్ళో వెయ్యను."

"పిల్లది అంత ముచ్చట పడి పోతుంది- పోనీ బళ్ళో వేద్దురూ!" తల్లి భారతమ్మ అనునయంగా అంది.

కాని ఊహించని సంఘటన జరిగింది.

దూరంగా కూర్చున్న చలమయ్య విసురుగా లేచొచ్చి భారతమ్మ చెంపలు వాయించాడు. అంతటితో ఊరుకోకుండా అడ్డువచ్చిన గంగను పిడిగుద్దులు గుద్ది దూరంగా తోసేశాడు.

"చచ్చినోడు! అంతకాని మాట ఏమిటన్నాను?" ఏడుస్తూ అంది తల్లి.

"దానికి బుద్ధి లేక పోతే నీకూవద్దంటే! చదువు కుంటుందా? చదువు? ఇది చదువకుని ఏ ఊళ్ళేలాలి?" కోపంగా అడిగాడు చలమయ్య.

"నే చదువుకుంటాను" రోషంగా అంది గంగ.

"తిన్న తన్నులు చాలలేదా?" రౌద్రంగా అడిగాడు చలమయ్య.

"చలమయ్య? ఎందుకు చదువుకోకూడదయ్యా? బిడ్డని గొడ్డును బాదినట్టు బాదావు?"

నీ యవ్వ చదువుకుందా? నువ్వు చదువుకున్నావా! మా తాత చదువుకోలేదు-మా నాన్న చదువుకోలేదు- ఆఖరికి నేను చదువుకోలేదు కదంటే... ఇప్పుడు దీనికి కావల్సొచ్చింది చదువు." వెటకారంగా అన్నాడు.

"అందుకే దానికన్నా చదువు చెప్పించమంటున్నా!"

"ఛీ! నోర్ముయ్! ఆడపిల్ల కేందే చదువు చెప్పించేది?! మొగాడు తిరక్క చెడ్డాడు- ఆడది తిరిగి చెడిందని సామెత ఊరికే పుట్టలేదు! రేపటినుండి మనతోపాటు పొలానికి తీసుకెళదాం- అవన్న నేర్చుకుంటుంది."

"నేరాను- నే బళ్ళోకే పోతాను"! గంగ మాట పూర్తయిందో లేదో అల్లంత దూరం ఎగిరిపడింది. భారతమ్మ పరుగెత్తుకుంటూ వచ్చి అడ్డుపడి తన్నులు తింది.

"ఈ రోజు నుండి ఈ యింట్లో చదువు గురించి మళ్ళీ మాట్లాడద్దు.. అంతే!" చలమయ్య హుకుం జారీ చేశాడు.

ఆ సంఘటనతో గంగ మనసులో భయం గూడు కట్టుకుంది. భారతమ్మ కూడ మళ్ళీ ప్రయత్నించలేదు.

కొంచెం పెద్దయింతర్వాత అయ్య చదువు ఎందుకు వద్దన్నాడో అర్థం చేసుకోగలిగింది. ఆ ఊరి కరణం కూతురు చదువుకుంటూ ఎవరితోనో లేచిపోయింది. మునసబు కూతురు కూడ చదువుకుని-తండ్రిని ఎదిరించి అతనికి ఇష్టం లేని పెళ్ళి చేసుకుంది.

సర్వ అనర్థాలకు కారణం ఆడపిల్లల చదువని ఆ ఊరి పెద్దలు తేల్చేశారు- ఆడపిల్ల కట్టుబాట్లలో పెరగాలంటే చదువు చెప్పించకూడదనే నిశ్చయానికి వచ్చేశారు.

కాని వేగంగా మారే కాలంలో చలమయ్య నిర్ణయం ఎంత తప్పో క్రమంగా అందరికీ తెల్సివచ్చింది.

గంగకు పెళ్ళికావడం చాలా కష్టమయింది.

ఎన్నో సంబంధాలు చూశాడు చలమయ్య.

చాలా మంది చదువుకున్న భార్య కావాలన్నారు.

ఇంకా కొంతమంది ఉద్యోగస్తురాలు కావాలన్నారు.

మరి కొంతమంది ఆమెను వింత పశువును చూసినట్టు చూశారు.

చిన్నప్పటినించి ఆశలు పెంచుకున్న అయిన సంబంధాలు కూడ ఆమెకు చదువురాదన్న మిషతో గాలికి కొట్టుకు పోయాయి.

అతి కష్టం మీద చలమయ్య శివరావు సంబంధాన్ని తేగలిగాడు. శివరావు అమ్మాయిని చూసి బాగానే ఉందన్నాడు-అపైన చదువు వచ్చి ఉంటే ఖచ్చితంగా చేసుకునేవాడినన్నాడు. దాదావు ఈ సంబంధం కూడా తప్పి పోతుందని నిశ్చయించుకుని గంగ బ్రతుకు మీద విరక్తి పెంచుకున్న తరుణంలో కొంచెం కట్నం భారీగా ముట్టచెబితే తనకు అభ్యంతరం లేదని మధ్యవర్తుల ద్వారా లోపాయకారీగా తెలియచేశాడు శివరావు.

తనశక్తికి మించినా, అతని గొంతెమ్మ కోరికలు తీర్చడానికి అంగీకరించాడు చలమయ్య.

ఉన్న పొలం తాకట్టుపెట్టి తమతాహతుకు మించి ఘనంగా పెళ్ళి చేశాడు.

శివరావు కొన్నాళ్ళు పెళ్ళాన్ని బాగా చూసుకున్నాడు. పట్టుపట్టి సంతకం పెట్టడం మటుకు నేర్పించాడు. గంగ పొంగిపోతూ సంతకం తొందరగా నేర్చేసుకుంది. భర్త తనకు చదువు చెప్పిస్తాడని ఎంతో ఆశపడింది.

ఇంతలోనే అతని వైఖరిలో తేడా వచ్చింది. స్నేహితుల పెళ్ళాలతో పోల్చి -తన దురదృష్టానికి నిందించేవాడు. చదువురాని మొద్దును చేసుకుని తాను చాలా నష్టపోయాడని వాపోతూ ఉండేవాడు.

చీదరింపులు-చిరాకులు మొదలై తన్నులుదాకా పోయింది సంసారం! కాని గంగకు సహనం జాస్తి కనుక పతిదేవుడికి అన్ని సపర్యలు చేసేది.

ఇంతలో నెల తప్పింది.

ఆషాఢమాసం వచ్చింది.

సగౌరవంగా పుట్టింటికి పంపించాడు.

ఎన్ని కొట్టినా తిట్టినా తనమామకు తనంటే ఎంత ప్రేమ - 'నీ గుర్తు నాకు ఉండాలి గంగీ' అంటూ కొన్ని తెల్ల కాగితాల మీద తన సంతకం తీసుకున్నాడు.

ఆ సంతకాలని ముద్దు పెట్టుకుని అపురూపంగా ఫైల్లో దాచుకున్నాడు.

"ఏంటే గంగా! అలా కళ్ళు తెరిచే నిద్రపోతున్నావు?" చలమయ్య లోపలికి వచ్చి కండువా గోడ మేకుకు తగిలిస్తూ అడిగాడు.

ఊహా లోకంలో విహరిస్తున్న గంగ ఉలిక్కిపడింది.

"మీ అల్లుడుగారు రాశారు నాన్నా!" సిగ్గుపడుతూ చెప్పింది.

"ఏం రాశాడేమిటి? నిన్నెప్పుడు తీసుకుపోతాడట!" అలవాట్లో పొరపాటుగా అడిగాడు చలమయ్య" ఓ నీకు చదువురాదు కదూ!" వెటకారం చేశాడు.

గంగకు కళ్ళెంబడ నీళ్ళు తిరిగాయి. అప్పుడు తాను చదువుకుంటానంటే చదివించందీ తనే! ఇప్పుడు చదువురాదని ఎగతాళి చేస్తున్నది తనే! ఇందులో తన తప్పేముంది? అయినా ఎప్పుడూ అదో అవలక్షణంలా మాట్లాడతారు ఈ జనం!

"సరేలే! మన వంశంలో ఎవరికొచ్చు కనుక?" దెప్పి పొడిచింది.

"ఆ ! అందుకేనే నాలుగు మెతుకులన్నా గతుకుతున్నాం - నువ్వడిగినట్టు నీకు చదువు చెప్పిస్తే - ఇప్పుడు అడుక్కుతింటూ ఉండే వాళ్లం-" కోపంగా అన్నాడు.

ఎన్నాళ్లు పోయినా ఈయన అభిప్రాయాలు మారవు. "ఎవరన్నా చదివి వినిపిస్తారేమో పిల్చుకురా?" దీనంగా అడిగింది.

"ఆ పంతులు ఉన్నాడు కాని - చదివి చెప్పిందానికి దక్షిణ యివ్వాలి - ఛీ! అయినా తప్పదుగా - తీసుకొస్తా!" విసుక్కుంటూ వెళ్లాడు.

"అమ్మా! నువ్వు పోయిం తర్వాత సంతకం నేర్చుకోగలిగానమ్మా - చదువుకునే రాత మటుకు నానుదుట లేదు." కళ్ల నీళ్లు తుడ్చుకుంటూ గోడకు వేలాడుతున్న ఫోటోలోని అమ్మకు విన్నవించుకుంది.

కాసేపటికి పంతులు వచ్చాడు చలమయ్యతోటి. "చదవండి పంతులుగారు. . . మాలాంటోళ్లకు కల్పవృక్షం మీరు. . . " గంగ మజ్జిగయిస్తూ అడిగింది.

"ఏదోనమ్మా - వానకాలం చదువులు - ఓ నాలుగు ముక్కలు నేర్చుకున్నా - అదే నా జీవనోపాధి అయింది." పంతులు చెప్పాడు.

"ముందు చదవ్వయ్యా - నా అల్లుడు ఏం రాశాడో విందామని కుతూహలంగా ఉంది - ఎప్పుడు వస్తున్నాట్టా? సెలవు దొరికిందా?" ఆదుర్దాగా అడిగాడు.

"మీ తొందర చూస్తుంటే . . . నన్ను ఎత్తి కుదేసేట్టున్నారు. ఇది నిదానంగా చదవాలి - ఉత్తరమా మజాకానా - పొలం పని అనుకున్నావా! నిదానంగా చదవకపోతే అర్థమే మారిపోతుంది - వెనకటికి నీలాంటివాడు రామునితోక పివరుండిట్లనియే అని చదివాట్ట! అది విని రాముడికి తోక ఎప్పుడొచ్చిందాని విన్నవాళ్లు జుట్టు పీక్కుని బట్ట తలలు చేసుకున్నారట!" కవరు చింపుతూ అన్నాడు పంతులు.

"అయ్యా! తమరి పిట్ట కథలు తర్వాత - ముందు పైకి చదవండి. ."

"ఇది ఇంగ్లీషులో ఉంది - పైకి చదివినా మీకర్థం కాదు." పంతులు పెంకిగా చెప్పాడు.

"కానీవయ్యా మగడా! తెలుగులో చెప్పు." చలమయ్య విసుక్కున్నాడు.

గంగ తన దురదృష్టాన్ని నిందించుకుంది. ఇన్నాళ్లకి తన భర్త రాసిన ప్రేమలేఖ తను స్వంతంగా చదువుకోలేకపోయింది.

ఇద్దరూ ఆతృతతో పంతులు మొహం చూడసాగారు. పంతులు మొహం వెలిగిపోయింది. చదువుతున్నకొద్దీ. . .

తండ్రీ కూతుళ్ల మనసు కుదుటపడ్డది.

"ఇది మీ అల్లుడు రాసింది కాదు చెలమయ్యా!"

"మరి?" గంగ ఆదుర్దా!

"శుభవార్త!"

"ఏంటది?!"

"మీ అల్లుడు మీ అమ్మాయికి విడాకులిస్తున్నాట్ట!" పంతులు చాలా తాపీగా చెప్పాడు.

ఇద్దరూ ఉలిక్కిపడ్డారు నివ్వెరపోయారు - వాళ్లు తేరుకోవడానికి కొన్ని నిమిషాలు పట్టింది.

"నీ మొహం మండ! ఇదేం శుభవార్తయ్యా?" చలమయ్య కోపంగా బాధగా అడిగాడు.

"నాకేం తెల్సు-మీరు అడిగారేమో, మీ అల్లుడు యిచ్చేస్తున్నాడు-శుభవార్త అన్నాను."

"నాన్నా! మోసం! ఆయన అలాంటి పని చెయ్యడు." గంగ ఏడుస్తూ అంది.

"నువ్వూరుకో తల్లీ - అసలు ఏం రాశాడు పంతులూ!" చలమయ్య అడిగాడు.

"ఇది మీ అల్లుడి లాయరు నోటీసు కాదు. విడాకులకోసం కోర్టులో మీరు దాఖలు చేస్తే. . . కోర్టు మీ అమ్మాయికి నోటీసు యిచ్చింది కోర్టులో హాజరు కమ్మని."

"శివయ్యా!" స్పృహ తప్పిపడిపోయింది గంగ.

చలమయ్య, పంతులు ఆమెను మంచం మీద పడుకోబెట్టి మొహాన నీళ్ళు జల్లారు. తేరుకున్న తర్వాత అడిగింది గంగ ఏడుస్తూ. .

"పంతులుగారూ! మీరు సరిగా అర్థం చేసుకున్నారా? నిజంగా మీకు యింగ్లీష వచ్చా? ప్లీజ్! రాదని చెప్పండి. . ఇంకోళ్ళతో చదివించుకుంటాం. . "

"పంతులుకు మనం ఏ అపకారం చేశామమ్మా అబద్ధాలు చెప్పడానికి." చలమయ్య ఏడ్పు ఆపుకుంటూ అన్నాడు.

"గంగా! మా అమ్మాయి మీద ప్రమాణం చేసి చెబుతున్నాను - ఇవి విడాకుల సమన్లేనమ్మా - నువ్వు కోర్టుకు హాజరు కావాలి! వాళ్ళు విడాకులు మంజూరు చేస్తారు." పంతులు తనూ బాధపడుతూ చెప్పాడు.

"ఛీ! దరిద్రంమొహందానా! అంత తప్పు నువ్వేం చేశావే!" చెంపమీద కొట్టాడు చలమయ్య.

"నన్ను నమ్ము అయ్యా! నేనేం చెయ్యలేదు. . . నాకు చదువురాదు - అదే నా తప్పు - అందుకే యింత పెద్ద శిక్ష!" ఏడుస్తూ చెప్పింది.

"చదువుకు దీనికి సంబంధం ఏమిటి?" పంతులు సాలోచనగా అన్నాడు.

"ఆయనకు చదువుకున్న పెళ్ళాం కావాలిట! అందుకని నన్ను వదిలించుకుందమనుకున్నాడు."

"అదికాదు పంతులూ! చదువుకోలేదంటే కోర్టు ఒప్పుకుని విడాకులిస్తుందా? నా బిడ్డ చదువుకోలేదని." ఆవేదన పడిపోతూ అడిగాడు చలమయ్య.

"కాదు - కాని అంతకంటే చాలా తప్పులు అతను పేర్కొన్నాడు. . . అది నా నోటితో చెప్పడం నాకిష్టం లేదు - మీరు పట్నంపోయి లాయర్ని కలవండి." పంతులు చెప్పాడు.

మరునాడు చలమయ్య, గంగ అల్లుడ్ని వెతుక్కుండూ పట్నం చేరారు. శివరావు వీళ్ళని పురుగును చూసినట్టు చూశాడు.

"ఎందుకొచ్చారు?" కోపంగా అడిగాడు.

"ఏంటి విడాకులిస్తున్నావట? ఏంటి కత? మింగిన కట్నం అరిగిపోయిందా? ఇంకా కట్నం కావల్సి వచ్చిందా?" కోపంగా అడిగాడు చలమయ్య.

"అయ్యా! నువ్వూరుకో అయ్యా! ఏమండీ? నేనేం తప్పు చేశానండి - నన్ను దూరం చేస్తున్నారు." దీనంగా అడిగింది అతని కాళ్ళమీద పడి.

"ఛీ! ఛీ! నిన్ను చూస్తేనే పంచమహాపాతకాలు చుట్టుకుంటాయి." దూరంగా తోసేశాడు." "మర్యాదగా కోర్టులో విడాకులు కావాలని చెప్పు. లేకపోతేనా. ."

"నా ప్రాణం పోయినా చెప్పను." గంగ మొండికేసింది.

"నీ యిష్టం - నీ పరువు పోతుంది. నువ్వు నలుగురిలో నవ్వులపాలవుతావు - లోకం ఛీ కొడుతుంది." చెప్పాడు.

"నలుగురిలో ఛీ కొట్టించుకునేటంత తప్పు నేనేం చెయ్యలేదు" రోషంగా అంది.

"అలానా! అయితే యివి చూడు." కొన్ని ఫోటోస్టాట్ కాగితాలు ఆమె మొహాన కొట్టాడు. ఆమె భద్రంగా వాటిని ఏరుకుంది. ఆ కాగితాల క్రింద ఆమె సంతకం ఉంది.

"నీకు చదువురాదుగా - దాంలో ఏం రాసుందో నీకేం తెల్సు."

"పోనీ వచ్చినవాడివి నువ్వు చెప్పు." చలమయ్య అన్నాడు.

"తనే స్వయంగా తను కులట - అని ఒప్పుకుంది నీ కూతురు. తను ఎవరెవరితో తిరిగింది - ఎవరెవరికి ప్రేమలేఖలు రాసింది అన్నీ దాన్లో ఉన్నాయి." నిదానంగా చెప్పాడు.

చలమయ్య ఉద్రేకం ఆపుకోలేక శివరావును ఎడా పెడా తన్నాడు.

అంతే!

గంట లోపల పోలీసులు అతన్ని అరెస్టుచేశారు.

గంగ ఏడ్చుకుంటూ ఆ కాగితాలు పట్టుకుని లాయర్ల దగ్గరికి పోయింది.

ఫీజులైతే భారీగా తీసుకున్నారు లాయర్లు. . .

కాని కొన్నాళ్ళకు కోర్టు గంగకు విడాకులు మంజూరు చేసింది. ఏ దేవుడూ ఆమె మొర ఆలకించలేకపోయాడు.

ఏడ్చుకుంటూ గంగ పోయి చలమయ్యకు చెప్పింది. కటకటాలు లెక్కబెడుతున్న చలమయ్య అంతా విన్నాడు.

"గంగా! వాడు కాదే నీకు అన్యాయం చేసింది. నేనే! నేను చదువుకుంటానని చిన్నప్పుడు ఎంత ఏడ్చినా నిన్ను బళ్ళోకి పంపలేదే! ఆడపిల్ల చదువుకుని ఎవర్ని ఉద్ధరించాలనుకున్నాను - చదువుకుంటే తెలివి ఎక్కువయిపోయి చెడిపోతుందనుకున్నాను - కాని కాని చదువురాని నీ జీవితం యిలా అన్యాయమయి పోతుందనుకోలేదే!" ఏడుస్తూ అన్నాడు.

"అయ్యా! నేను సంతకం నేర్చుకోకుండా ఉండాల్సింది. మామ అడిగాడు కదాని ముచ్చటపడి తెల్లకాగితాల మీద పెట్టకుండా ఉండాల్సింది. నాదేనయ్యా తప్పు." భోరుమని ఏడుస్తూ అంది.

"కాదే నాదేనే తప్పు! నువ్వు చదువుకునుంటే యింత సులభంగా మోసపోయి ఉండేదానివి కాదే - ఇలా సంతకాలు పెట్టి ఉండేదానివికాదే!" కటకటాలకేసి తలబాదుకుంటూ పశ్చాత్తాపపడ్డాడు. గంగ తండ్రి చలమయ్య.

(వయోజన విద్యా విభాగం వారు నిర్వహించిన పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ ఆకాశవాణి కడప కేంద్రం ద్వారా పలుమార్లు ప్రసారం)

(1988)

